సాక్షి చిత్తూరు

శనివారం । 17 । మే । 2025



పలమనేరులో భారీ వర్షం

పలమనేరు నియోజకవర్గంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. - IIలో



డీఎస్సీకి 26,501 దరఖాస్తులు

డీఎస్సీకి ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 26,501 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు. - IIలో



రసవత్తరంగా కుస్తీపోటీలు

చిత్తూరులోని మెసానికల్ మైదానంలో రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు శుక్రవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. - IIలో

న్యూస్‌రీల్

ఘనంగా సంకటహర చతుర్థి



ఉత్సవమూర్తికి పూజలు చేస్తున్న అర్చకులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. చతుర్థి సందర్భంగా ఉదయం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు సుగంధ పుష్పాలతో అలంకరణ చేసి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని చేపట్టారు. రాత్రి ఆలయ మాడ వీధుల్లో కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి స్వర్ణ రథంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈవో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో రేషన్ పంపిణీ ఆఖరు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో రేషన్ పంపిణీ శనివారంతో ముగియనుందని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి జిల్లాలో రేషన్ పంపిణీ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 88శాతం పంపిణీ పూర్తియిందన్నారు. మిగిలిన కార్డుదారులు సాయంత్రంలోపు రేషన్ తీసుకోవాలని ఆయన సూచించారు.

బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని టాస్క్‌ఫోర్స్ కమిటీ బాధ్యతగా పని చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె శిశు మరణాల టాస్క్‌ఫోర్స్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏడాది లోపు చనిపోయే పిల్లలు కూడా శిశు మరణాల కిందకే వస్తారన్నారు. గత నెల రోజుల వ్యవధిలో 8 శిశుమరణాల సంభవించాయని చెప్పారు. ఇవన్నీ కూడా ఆస్పత్రుల్లోనే నమోదైనట్టు పేర్కొన్నారు. డీఐఓ హనుమంతరావు, అధికారులు లత, అనిల్‌కుమార్, సింధూర, వెంకటేశ్వరి, మోహన్‌బాబు, ఉషశ్రీ, అనూష పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గొర్రెల పెంపకందారులకు ఉచితంగా రుణాలు ఇవ్వాలని చిత్తూరు జిల్లా గొర్రెల పెంపకందారుల సొసైటీ అధ్యక్షుడు గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సహకార జిల్లా యూనియన్ కార్యాలయంలో లక్ష్మీ వెంకటేశ్వర గొర్రెల పెంపకందారుల సొసైటీ అధ్యడి ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అధ్యక్షులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, యాభై ఏళ్లు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు నేతలు పాల్గొన్నారు.



ఆగిపోయిన ఆవులపల్లె రిజర్వాయర్ పనులు (ఫైల్)

కరువును పారద్రోలి..బీడు భూములు సస్యశ్యామలం చేయాలన్న సంకల్పానికి టీడీపీ నేతలు గండికొట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన ముదివేడు, నేతికుంటపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ల నిర్మాణ పనులను అడ్డుకుని కేసులు వేశారు. ఇది చాలదన్నట్టు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా వేధింపులకు దిగుతున్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక విజిలెన్స్ విచారణ పేరుతో కొత్త నాటకానికి తెరదీశారు. రాయలసీమలోనే పెద్దాయనగా పేరుగడించిన మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కక్షగట్టి ప్రాజెక్టులకు శిక్ష వేశారు. ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అవిరాళ కృషిని నీరుగార్చారు. దీనిపై రైతులు రగిలిపోతున్నారు.

పెద్దాయనపై కక్ష.. రిజర్వాయర్లకు శిక్ష

- రూ.2,144 కోట్లతో ముదివేడు, నేతికుంటపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ల నిర్మాణం
- హంద్రీ-నీవా ప్రాజెక్టులోనే ఆవులపల్లె అతిపెద్ద రిజర్వాయర్
- టీడీపీకి మనుగడ ఉండదన్న కక్షతో ఎన్జీటీలో కేసు
- అర్ధంతరంగా ఆగిపోయిన రిజర్వాయర్ల పనులు
- రూ.800 కోట్ల పనులకు బిల్లులు పెండింగ్
- ఇప్పుడు విజిలెన్స్ విచారణ పేరుతో కొత్త నాటకం
- 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం తప్పా?

మదనపల్లె: ఆసియా ఖండంలో అతిపెద్ద, 31 ఎత్తిపోతలు కలిగిన ప్రాజెక్టు హంద్రీ-నీవా. ఈ ప్రాజెక్టులో అతిపెద్ద రిజర్వాయర్ చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలంలో ఆవులపల్లె. 3.5 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో చేపట్టిన ఈ రిజర్వాయర్ కింద 20 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి, కొత్తగా 40 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. ఇంత గొప్ప రిజర్వాయర్ నిర్మాణం చేపట్టలేని టీడీపీ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టడాన్ని జీర్ణించుకోలేక పోయింది. అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లె నియోజకవర్గంలో 120 చెరువులకు నీటినందించి, 15 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి, కొత్తగా 20 వేల ఎకరాలను సాగులోకి తేవాలని లక్ష్యంతో రెండు టీఎంసీల సామర్థ్యంతో ముదివేడు రిజర్వాయర్ పనులు చేపట్టారు. చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలంలో ఒక టీఎంసీ సామర్థ్యంతో నేతికుంటపల్లె రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి దీనికింద 5 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి, కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఈ పనులు పూర్తయితే వీటి నిర్మాణం కోసం కృషి చేసిన పెద్దాయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని భావించారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో మరింత ఆదరణ పెరగుతుందని కుట్రపన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో టీడీపీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని భయపడిపోయారు. అందుకే దీన్ని జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు కేసులు వేసి అడ్డుపుల్ల వేశారు.

టెండర్‌లో రూ.64 కోట్ల ఆదా

మూడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2,144.50 కోట్లు మంజూరు చేయగా టెండర్ల నుంచి ఒప్పందం వరకు అన్ని పారదర్శకంగానే జరిగాయి. ఇందులో నిర్మాణాలకు రూ.1,529.37 కోట్లు, భూసేకరణ, ఇతరా పనులకు రూ.615.13 కోట్లు కేటాయించారు. మూడు రిజర్వాయర్లను ఒకేపనిగా రూ.1,554,21,60,649 అంచనా వ్యయంతో నిర్వహించిన టెండర్లలో ఎన్‌ఈసీఎల్, ఆర్ఆర్‌సీఐఐపీఎల్ జాయింట్ వెంచర్, మేఘా ఇంజినీరింగ్ వర్క్, హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైయివేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. అంచనా కంటే అధికంగా రూ.1,618.72 కోట్లకు టెండర్లు వేయగా, దీనిపై ప్రభుత్వం రివర్స్ టెండర్ నిర్వహించగా జాయింట్ వెంచర్ సంస్థ రూ.1,553.96 కోట్లతో టెండర్ వేయడంతో ప్రభుత్వానికి రూ.64.76 కోట్ల వరకు ఆదా అయ్యింది.

అప్పుడు ఎన్జీటీతో..ఇప్పుడు విజిలెన్స్‌తో

మూడు రిజర్వాయర్ల నిర్మాణ పనులు మొదలయ్యాక టీడీపీ నేతలు అడ్డంకులు సృష్టించడం మొదలు పెట్టారు. ఎన్జీటీలో కేసు వేసి పనులు నిలిపివేయించారు. 2023 ఆగస్టు 4న ప్రాజెక్టుల సందర్శన పేరుతో అంగళ్లుకు వచ్చిన చంద్రబాబుకు వినతిపత్రం ఇవ్వాలని ప్రయత్నించిన వారిపై టీడీపీ శ్రేణులు దాడులు చేశాయి. ఇప్పుడు అధికారంలోకి రావడంతో విజిలెన్స్ విచారణ పేరుతో రిజర్వాయర్లకు సమాధి కట్టే ప్రయత్నాలు మొదలు పెట్టారు. శుక్రవారం మదనపల్లె, తంబళ్లపల్లెల్లో పర్యటించిన జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ రిజర్వాయర్లను ఉద్దేశించి చేసిన ఆరోపణలు చేయడంపై రైతులు మండిపడుతున్నారు.





ఆగిపోయిన ముదివేడు రిజర్వాయర్ పనులు (ఫైల్), నేతికుంటపల్లె రిజర్వాయర్ (ఫైల్)

రూ.800 కోట్లు పెండింగ్

ఈ మూడు రిజర్వాయర్లకు సంబంధించి పనులు నిలిపివేసిన 2023 మే 11 నాటికి ముదివేడు రిజర్వాయర్ 33 శాతం, నేతికుంటపల్లె 86 శాతం, ఆవులపల్లె 5.8 శాతం పనులు జరిగాయి. మొత్తం టెండర్ వ్యయంలో జరిగిన పని విలువ రూ.800 కోట్లకు పైనే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెల్లించింది రూ.30 కోట్లని సమాచారం. చేసిన పనులకు ప్రస్తుత ప్రభుత్వం రూ.800 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే రిజర్వాయర్లకు శాశ్వత సమాధి కట్టడం కోసం కూటమి ప్రభుత్వం పెద్దాయనపై కక్షతో కరువు రైతాంగానికి శిక్ష విధిస్తోంది.



ముదివేడు రిజర్వాయర్ పనులు ఆగడంతో దుస్థితి

సాగునీరు అందించడం తప్పా

మూడు రిజర్వాయర్ల ద్వారా 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న మహత్తర లక్ష్యం తప్పా అని రైతాంగం ప్రశ్నిస్తోంది. సాగునీటి రంగంలో దశాబ్దాలుగా వెనుకబడిన తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో రైతాంగ సంక్షేమానికి పెద్దాయన పెద్దపీట వేయడం నేరమా అని నిలదీస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాల్లో పెద్దాయనను ఎదుర్కొనే వ్యూహం లేని టీడీపీ ఆయన చేపట్టిన అభివృద్ధిపై ఇలా అక్కసు వెళ్లగక్కడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత ఈ రిజర్వాయర్ల పరిస్థితిపై రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ పాటికే పూర్తి కావాల్సిన పనులను అడ్డుకుని నిలిపివేయడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి!

- నన్ను ఎవరూ ఏమీ చేయలేరు
- రెవెన్యూ అధికారుల ముందే సవాల్ విసిరిన వీఆర్వో
- సచివాలయం ముందు గ్రామస్తుల నిరసన

గంగాధర నెల్లూరు : మండలంలోని వింజం పంచాయతీ వీఆర్వో ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వైఖరి పట్ల స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ఎంపీటీసీ హనీఫ్ బాషా, గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు శుక్రవారం నిరసనకు దిగారు. వీఆర్వో గ్రామంలోని రైతులు, విద్యార్థులకు అందుబాటులో ఉండడం లేదని, ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని, సర్టిఫికెట్ల కోసం 20 రోజులుగా విద్యార్థులు కార్యాలయాల చుట్టూ చక్కెర్లు కొడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోగా.. వారి ముందే గ్రామస్తులపై వీఆర్వో చిందులేశారు. 'నన్ను ఎవరూ ఏమీ చేయలేరు.. ఏ అధికారి ఏమీ చేయలేడు.. నాకు రాజకీయ అండదండలున్నాయి.. మీకు దిక్కున్న చోట చెప్పుకోండి' అంటూ చెలరేగిపోయాడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు యువరాజు మాట్లాడుతూ వీఆర్వో ప్రవీణ్ కుమార్ వైఖరి వివాదాస్పదంగా ఉందని, ధనికులు, కూటమి నాయకుల సేవలోనే తరిస్తున్నాడని తెలిపారు. అదే పేద, మధ్యతరగతి రైతులకు సేవలందించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాడని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి సదరు వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరారు.



సచివాయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ హనీఫ్ బాషా, గ్రామస్తులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, డెంగీపై నిర్లక్ష్యం వద్దని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ సూచించారు. చిత్తూరు నగరం, చవటపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. అపరిశుభ్రమైన వాతావరణం వల్లే సగం వ్యాధులు వస్తాయన్నారు. వర్షాకాలంలో అతిజాగ్రత్తగా ఉండాలన్నారు. ఎంహెచ్‌ఓ లోకేష్, వైద్యులు దిలీప్, ఆశ, సాయిగౌతమ్, జయరాముడు, రామకృష్ణ పాల్గొన్నారు.



వైద్యాధికారుల ర్యాలీ

వైభవంగా సుమంగళి సౌభాగ్య మహోత్సవం





పసుపు, కుంకుమతో మహిళల ర్యాలీ (ఇన్‌సెట్) సుమంగళి సౌభాగ్యం ప్రత్యేక పూజలు

కుప్పం: శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సుమంగళి సౌభాగ్య మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జాతరలో ఈ ఏడాది నూతనంగా సుమంగళి సౌభాగ్య మహోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ప్రారంభించింది. అమ్మవారికి ఎంతో ఇష్టమైన శుక్రవారం ముత్తైదువులు సారె సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టింది. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పసుపు, కుంకుమ, వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి తరలివచ్చిన మహిళలకు కమిటీ సారెను అందజేసింది. ఆలయ ప్రాంగణం నుంచి చెరువు కట్టపై ఉన్న బావి దగ్గరకు వెళ్లి శిరస్సు, కళ్లు తెర తొలగించే చోట ఈ మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టింది. అనంతరం ర్యాలీగా ఆలయానికి తరలివచ్చారు.

20 వేల మందికి అన్నదానం

జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. 19 రకాల వంటకాలతో భోజనాలు వడ్డించారు. ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డు ప్రాంగణంలో సంపక్తి భోజనాలను వడ్డించారు. సుమారు 20 వేల మందికిపైగా భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పురవీధుల్లో ఊరేగింపు

గంగ జాతర సందర్భంగా ముత్తుమారెమ్మ ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. పలకవాయిద్యాల మధ్య పాతపేట, కొత్తపేట, రైల్వేగేటు వరకు అమ్మవారి ఉత్సవ ఊరేగింపును చేపట్టారు.





ఆలయ ప్రాంగణంలో అన్నదానం, శేష వాహనంపై ఊరేగుతున్న ముత్తుమారెమ్మ

ఒప్పించి కాదు నొప్పించి!

- అయ్యోర్లను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- బదిలీలు, ఉద్యోగోన్నతుల సమస్యలను పరిగణనలోకి తీసుకోని వైనం
- 21న ఉమ్మడి జిల్లా డీఈఓ కార్యాలయం ముట్టడికి పిలుపు



రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశాన్ని రద్దు చేసి రోడ్డెక్కిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : అధికారంలోకి రాక ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాటను అమలు చేయడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య. ఎన్నికలకు ముందు టీచర్లకు అనేక హామీలు గుప్పించింది. తీరా అధికారంలోకి వచ్చాక హామీల అమలు విషయం దేవుడెరుగు.. క్షేత్ర స్థాయిలో టీచర్ల సమస్యలు, డిమాండ్లను పరిష్కరించకుండా చుక్కలు చూపిస్తోంది. త్వరలో నిర్వహించే ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ అన్యాయం చేస్తోంది. దీనిపై ఉపాధ్యాయ లోకం నిప్పులు చెరుగుతోంది.

ఏకపక్ష జీవోలు సరికాదు

కూటమి ప్రభుత్వం ఏక పక్షంగా తీసుకొస్తున్న జీవోలను టీచర్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. గత 30 వారాలుగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన యూనియన్లతో సమావేశాలు నిర్వహించి డిమాండ్లను సేకరించినప్పటికీ అమల్లోకి తీసుకొకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా అమల్లోకి తీసుకొచ్చిన 19, 20, 21 జీవోలను వ్యతిరేకిస్తున్నట్లు తేలిచ్చెబుతున్నారు. ఉపాధ్యాయ సంఘాలను ఒప్పించి చేస్తున్నామంటూ అపోహలు సృష్టించి.. నొప్పించే ధోరణితో వ్యవహరిస్తున్నారని దుయ్యబడుతున్నారు.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి

డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 21న ఉమ్మడి జిల్లా డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రకటించింది. కూటమిపై పోరాటానికి అన్ని సంఘాలు కలిసి వచ్చినట్టు పేర్కొన్నాయి.

డిమాండ్లు ఇవే

- ఉన్నత పాఠశాలల్లో 1:30 నిష్పత్తి ప్రకారం 45 మంది విద్యార్థులు దాటిన తర్వాత రెండో సెక్షన్‌ను ఏర్పాటు చేయాలి. ఆ తర్వాత ప్రతి 40 మందికి మరో సెక్షన్‌ను ఏర్పాటు చేయాలి.
- మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్‌లను నియమించడం అశాస్త్రీయం.
- బదిలీల్లో స్టడీ సెలవులో ఉన్న టీచర్ల స్థానాలను ఖాళీగా చూపరాదు.
- ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో 41 వద్ద 3వ పోస్టు ఇవ్వాలి. ఏప్రిల్ 23వ తేదీ రోల్‌ను పరిగణనలోకి తీసుకోవాలి.
- పోస్టులను బ్లాక్ చేస్తుండడం సరైన పద్ధతి కాదు.
- 2023లో రేషనలైజేషన్ చేసి 2023లో ఉద్యోగోన్నతి పొంది 2025లో రేషనలైజేషన్ అవుతున్న టీచర్లకు బదిలీల్లో అన్యాయం జరుగుతోంది. అటువంటి వారికి బదిలీల్లో 8 సంవత్సరాల పాయింట్లు కేటాయించాలి.
- పీహెచ్‌సీ కోటా టీచర్లను రేషనలైజేషన్ చేయడం సరైన పద్ధతి కాదు.
- ప్రభుత్వ, పంచాయతీరాజ్ సర్వీస్ రూల్స్ సమస్య తేలకుండా 8 ఏళ్లుగా లాంగ్ స్టాండింగ్ అయిన టీచర్లను సొంత యాజమాన్యానికి వెళ్లమని చెప్పడం భావ్యం కాదు.
- ఎంఈవోలకు బదిలీలు నిర్వహించి కోరుకున్న ఎంఈఓ 1, ఎంఈవో 2లకు హెచ్‌ఎం కన్వర్షన్ ఇవ్వాలి.

ఎందుకు మోసగిస్తున్నారు



డిమాండ్లను పరిగణలోకి తీసుకుంటున్నామంటూ టీచర్లను ఎందుకు మోసగిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. టీచర్లకు బదిలీల్లో, ఉద్యోగోన్నతుల్లో అన్యాయం జరిగితే సహించేది లేదు. శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సమావేశాన్ని బహిష్కరించి ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదికగా ఒక్కటయ్యాం. పోరాటాలకు సిద్ధమవుతున్నాం.

– బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు

డిమాండ్లను పరిష్కరించాలి



డిమాండ్లను తప్పనిసరిగా పరిష్కరించాల్సిందే. టీచర్లకు అన్యాయం చేస్తే సహించేది లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పాఠశాల విద్యాశాఖలో నెలకున్న సమస్యలు, ఇబ్బందులను గుర్తించి తెలుగు మీడియంను సమాంతరంగా కొనసాగించాలి.

– గిరిప్రసాద్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తాం



విద్యాశాఖ అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 21న ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించేందుకు సిద్ధమవుతున్నాం. కూటమి ప్రభుత్వం విద్యారంగ సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరుస్తోంది.

– జీవీ రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

తీరని అన్యాయం



సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం టీచర్లకు తీరని అన్యాయం చేస్తోంది. సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. టీచర్ల పట్ల అంత అలుసు ఎందుకు చూపుతున్నారో.

– రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్.

అత్యవసరమైనా ఉండరే?

చౌడేపల్లి: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్‌తో సహా సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. ఒకవేళ వచ్చినా రోగులను సక్రమంగా పట్టించుకోవడం లేదు. ఇలాంటిదే శుక్రవారం ఓ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండలంలోని పందిళ్లపల్లెకు చెందిన పీ.రెడ్డిప్రసాద్(33) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారస్థితికి చేరాడు. కుటుంబ సభ్యులు పవన్, మనోహర్ అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో ఆస్పత్రిలో సిబ్బంది ఎవరూ లేరు. బిగ్గరగా అరుస్తూ అత్యవసర కేసు వచ్చింది.. ఎవరూ లేరే.. రండి డాక్టర్, నర్సు ఎక్కడ అంటూ కేకలు వేశారు. సుమారు అర్ధగంట అయినా ఎవరూ రాలేదు. తరువాత సిబ్బంది ఒకరు వచ్చి స్టాఫ్ ఎవరూ లేరని చెప్పారు. తర్వాత 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి డాక్టర్లు శుక్రవారం అతన్ని తిరుపతి స్విమ్స్‌కు రెఫర్ చేశారు.





ఖాళీగా డాక్టర్ గది, ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న రెడ్డిప్రసాద్, అతని కుటుంబ సభ్యులు



రైతు నెత్తిన లైనింగ్ పిడుగు

- 2.86 లక్షల ఎకరాల ఆయకట్టుకు కృష్ణా జలాలు లేనట్టే
- లైనింగ్ పనులతో ఆయకట్టుకు చుక్కనీరు పారదు
- ముందుచూపుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పథకాలను సమాధి చేసిన కూటమి ప్రభుత్వం
- అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు అన్యాయం



పీబీసీలో లైనింగ్ పనులు

మదనపల్లె: రైతులతో కూటమి ప్రభుత్వం చెడుగుడు ఆడుతోంది. అందరూ వ్యతిరేకిస్తున్న హంద్రీ–నీవా ప్రాజెక్టులో భాగమైన పుంగనూరు ఉప కాలువ, కుప్పం ఉప కాలువలకు లైనింగ్ పనులు చేపట్టింది. ఫలితంగా 2.86 ఎకాలకు సాగునీరు అందకుండా పోయే అవకాశం ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల రైతుల తలరాతను మార్చేలా పథకాలు చేపట్టారు. రూ.వేల కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ పక్కనపెట్టింది.

పథకాలకు సమాధి కట్టి లైనింగ్

హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు కృష్ణా జలాలను అధనంగా తరలించాలని గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. గాలేరు–నగరి, హంద్రీ–నీవా ప్రాజెక్టులను అనుసంధానం చేసే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ.4,373.23 కోట్లతో పనులు మొదలుపెట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి వెయ్యి కోట్లకుపైగా పనులు పూర్తిచేశారు.

ఈ పథకం ద్వారా గండికోట రిజర్వాయర్ నుంచి జిల్లాలోకి పీటీఎం మండలం వద్ద హంద్రీ–నీవా కాలువలోకి కృష్ణా జలాలు తరలించేలా పనులు చేపట్టారు. ఈ పని పూర్తయితే జిల్లాకు అధనంగా 13 టీఎంసీల కృష్ణా జలాలను తరలించవచ్చు. అయితే ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేయడంతో రైతుల ఆశలను ఆడియాశలయ్యాయి. ఇదికాక పెద్ద తిప్పసముద్రం మండలం, కిలోమీటర్ 79.600 నుంచి పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం కిలోమీటర్ 220.350 వరకు పుంగనూరు కాలువలో 1,180 క్యూసెక్కులు ప్రవహించేలా వెడల్పు చేసి చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 12 టీఎంసీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తరలించుకునేలా రూ.1,129 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనులు చేపట్టింది. ఈ రెండు మార్గాల్లో 25 టీఎంసీలు తరలించుకుంటే శాశ్వత కరువు నివారణ, సాగు, తాగునీటికి ఇబ్బందులు తొలగిపోతాయి.

అయితే ఈ పథకాలను కూటమి ప్రభుత్వం కక్ష్యగట్టి పక్కన పెట్టడంతో రైతుల ఆశలు సమాధి అయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2,144.50 కోట్లతో తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లోని ముదివేడు, నేతికుంటపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ల నిర్మాణాలను టీడీపీ నేతలు కోర్టు కేసులతో అడ్డుకుని పనులు నిలిపివేయించారు. దీంతో 25 టీఎంసీల్లో ఈ మూడింటికీ కేటాయించిన 6.5 టీఎంసీల కృష్ణా జలాలు వాడుకోలేని పరిస్థితి నెలకొంది.

లైనింగ్‌తో 2.86 లక్షల ఎకరాలు బీళ్లు




ప్రాజెక్టుల అనుసంధానం, కాలువ వెడల్పు పనులు పూర్తయ్యాక జిల్లాలో 2.86 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే కూటమి ప్రభుత్వం కాలువలకు లైనింగ్ పనులు చేపట్టిన కారణంగా ఒక్క చుక్క నీరు కూడా పొలాలకు పారించే అవకాశం లేదు. మనం వాడుకోవాల్సిన 25 టీఎంసీలలో కనీసం రెండు టీఎంసీలైనా తరలించుకోలేని పరిస్థితి దాపురించింది. ఈ లైనింగ్ కారణంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో 41,150 ఎకరాలు, పుంగనూరు నియోజకవర్గంలో 17,800, పలమనేరులో 8,100, చిత్తూరులో 6,200, చంద్రగిరిలో 6,400, పీలేరులో 76,200, జీడీనెల్లూరులో 4,050, పూతలపట్టులో 16,100 ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి తెలెత్తింది. కొత్త నిర్మాణం మొదలై ఆడ్డంకులతో ఆగిపోయిన ముదివేడు రిజర్వాయర్ కింద 35 వేల ఎకరాలు, నేతికుంటపల్లె రిజర్వాయర్ కింద 15వేల ఎకరాలు, ఆవులపల్లె రిజర్వాయర్ కింద 60వేల ఎకరాల ఆయకట్టు భూమికి చుక్క సాగునీరు కూడా అందే అవకాశం లేదు.

25 టీఎంసీలు కోల్పోయే అవకాశం

జిల్లాలోని పీటీఎం మండలం కాట్నగల్లు పంచాయతీ నుంచి మొదలయ్యే పుంగనూరు ఉపకాలువ పలమనేరు నియోజకవర్గంలో కుప్పం ఉపకాలువతో కలిసిపోతుంది. కుప్పం నియోజకవర్గం పరమసముద్రం వద్ద హంద్రీ–నీవా ప్రాజెక్టు అంతమవుతుంది. ఈ రెండు కాలువలు 343 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తాయి. వీటి లైనింగ్ పూర్తయ్యాక ప్రవాహ సామర్థ్యం 380 క్యూసెక్కులు ఉన్నా చివరికి వెళ్లే సమయానికి 216 క్యూసెక్కులకు తగ్గిపోతుంది. మొత్తంగా 25 టీఎంసీల నీటిని వినియోగించుకోలేని పరిస్థితి తలెత్తుతుంది.

పెద్దిరెడ్డి చేసిన కృషిని చూసి ఓర్వలేక



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీబీసీలో కృష్ణమ్మ గలగల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాను సాగునీటితో సస్యశ్యామలం చేసేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేసిన కృషి మరువలేనిది. వైఎస్సార్‌సీపీని ఆదరిస్తున్న ప్రజలు, రైతుల కోసం ప్రత్యేకంగా మూడు రిజర్వాయర్లు, పీబీసీ వెడల్పు, హంద్రీ–నీవా, గాలేరు–నగరి ప్రాజెక్టుల అనుసంధాన పథకం మంజూరుకు చేసిన కృషి ఈ ప్రాంత ప్రజలకు తెలుసు. దీంతో రాజకీయంగా టీడీపీ బలహీనపడుతుందని ఈ పథకాలపై పెద్దిరెడ్డి కుటుంబ ముద్ర ఉండకూడదన్న కక్ష్యతో కూటమి ప్రభుత్వం వాటిని పక్కనపెట్టిందని రైతులు చర్చించుకుంటున్నారు.

31 కిసాన్ డ్రోన్లు మంజూరు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాకు కిసాన్ డ్రోన్లు 31 దాకా మంజూరైనట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఐదుగురు రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి డ్రోన్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆ ఐదుగురిలో ఒకరిని డ్రోన్‌పైలెట్‌గా ఎంపిక చేసి ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. డ్రాగో కంపెనీ డ్రోన్ మొత్తం ధర రూ.9.5 లక్షలు, విహంగ కంపెనీ ధర రూ.9.81 లక్షలు ఉందన్నారు. వీటిని 80 శాతం రాయితీతో ఇస్తామన్నారు. కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ అధికారుల నోటీసులు



గంగాధర నెల్లూరు : మండలంలోని అగర మంగళం పంచాయతీ పరిధిలోని దళిత వాడల్లో విద్యుత్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆపై గ్రామస్తులకు నోటీసులు అందజేశారు. దళిత గ్రామాలలో తనిఖీలు నిర్వహించి మీటర్లు లేని ఇండ్ల యజమానులకు నోటీసులిచ్చి జరిమానాలు విధించినట్లు గ్రామస్తులు తెలిపారు. అగర మంగళం గ్రామంలో దాదాపు 17 కుటుంబాలకు నోటీసులు అందించినట్లు పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఇద్దరు డిబార్



సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల్లో మాల్‌ప్రాక్టిస్‌కు పాల్పడ్డ ఇద్దరు విద్యార్థులను అధికారులు డిబార్ చేశారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షను నిర్వహించారు. ప్రథమ సంవత్సర పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 5,854 మందికి 331 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్‌లో కలిపి 1,554 మందికి 95 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని సదుం, సోమల, పుంగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మదర్ థెరీసా జూనియర్ కళాశాల, పలమనేరు ప్రభుత్వ జూనియర్, శ్రీ వాణి జూనియర్ కళాశాల, బంగారుపాళ్యం ప్రభుత్వ కళాశాలలను డీఐఈవో డా.ఆదూరు, శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

వినాయకుడి సన్నిధిలో ఐఆర్ఎస్ అధికారులు



స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దగ్గరుండి స్వామి దర్శనం కల్పించారు. వేద ఆశీర్వచన మండపంలో పండితుల చేతుల మీదుగా ఆశీర్వచనాలు అందజేశారు. ఏఈవో రవీంద్రబాబు వారికి ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, బాలాజీ పాల్గొన్నారు.

హంద్రీ–నీవా కాలువ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

వి.కోట: హంద్రీ–నివా సుజల స్రవంతి రెండో దశ కుప్పం ఉప కాలువ పనులను శుక్రవారం రాష్ట్ర జలవనరుల అభివృద్ధిశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. మండలంలోని దాసార్లపల్లి గ్రామం వద్ద జరుగుతున్న పనులను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మండల అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కాలువ పనులు పరిశీలించి పలు సూచనలు చేసి మాట్లాడారు. నాణ్యతతో త్వరతగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరారు. పలమనేరు ఆర్‌డీఓ భవాని, ఇతర అధికారులు, నేతలు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా పది సప్లిమెంటరీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు పదో తరగతి సప్లిమెంటరీ, మే 19 నుంచి 24వ తేదీ వరకు ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పదవ తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాల్లో 8,765 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు 9 కేంద్రాల్లో 2,182 మంది, పది పరీక్షలకు 12 కేంద్రాల్లో 670 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలని ఆదేశించారు.

మూడో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రాలో మొక్కలు నాటే కార్యక్రమం తప్పనిసరిగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. మూడవ శనివారం పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయి కార్యాలయాల పరిధిలో 5 నుంచి 10 మొక్కలు నాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా కనీసం 2 వేల మొక్కలు నాటాలని ఆదేశించారు.

ప్రారంభోత్సవంలో అధికార దర్పం

- యథేచ్ఛగా ప్రొటోకాల్ ఉల్లంఘన
- ప్రజాప్రతినిధులకు అవమానం
- ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓడిపోయిన వ్యక్తికి శిలాఫలకంలో చోటు
- తెలిసి తప్పు చేసిన అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్సు: ఎన్నికైన ప్రజాప్రతినిధులకు లేని గౌరవాన్ని ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓడిపోయిన ఓ నేతకు అధిక ప్రాధాన్యతతో ప్రొటోకాల్ కల్పించారు జిల్లా స్థాయి అధికారులు. అధికార పార్టీ నేతలకు తలొగ్గి ప్రొటోకాల్‌ను ఉల్లంఘించి ప్రజాప్రతినిధులను అవమానపరిచిన ఘటన శుక్రవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ పాలటెక్నిక్ కళాశాల ప్రారంభోత్సవంలో చోటు చేసుకుంది. వివరాలు.. పుంగనూరు నియోజకవర్గం, చౌడేపల్లె మండలం, కాటిపేరి వద్ద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కలిసి రూ.3 కోట్లతో 58 ఎకరాల్లో పాలటెక్నిక్ కళాశాలను మంజూరు చేయించారు. తక్షణం అద్దె భవనాలను ఏర్పాటు చేసి అప్పట్లో అడ్మిషన్లను నిర్వహించి పనులను వేగవంతం చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారింది. భవన నిర్మాణ పనులు పూర్తయ్యాక శుక్రవారం రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కలిసి ప్రారంభించారు.



ఆహ్వాన పత్రికలో ప్రొటోకాల్ ఉల్లంఘించిన దృశ్యం

అయితే ఆహ్వాన పత్రికలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తూ అధికారులు శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఆ ప్రాంత సర్పంచ్ సరితా సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతమ్మ తోపాటు ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజుకి ప్రాధాన్యం ఇవ్వకుండా అవమానపరిచారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన చల్లా రామచంద్రారెడ్డికి మాత్రం అగ్రతాంబూళం వేశారు. మండల స్థాయి ప్రజాప్రతినిధుల పేర్ల పైన ఆయన పేరును ప్రత్యేక అతిథిగా ముద్రించి అధికారులు స్వామి భక్తిని చాటుకున్నారు. ఇదిలావుండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చల్లా రామచంద్రారెడ్డి అధికారులతో వరుస సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీనిపై టీడీపీ నాయకులే సోషల్ మీడియా వేదికగా పలు ఆరోపణలు చేస్తున్నారు. ఈ ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

మానవత్వానికి మరో పేరు జగన్



నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

కార్వేటినగరం: దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వానికి మరో పేరుగా మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమర జవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి తన గొప్పతనాన్ని చాటుకున్నారని తెలిపారు. గతంలోనూ పలు ఘటనల్లో ఉదారంగా బాధిత కుటుంబాలకు సాయం అందించారని గుర్తుచేశారు.

కాపాడుతారా.. వత్తాసు పలుకుతారా!

– అటవీభూమి కబ్జా కేసు నీరుగార్చే కుట్ర

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి నేతల అటవీ భూ కబ్జా వ్యవహారం తప్పుదారి పట్టేలా ఉంది. ఆక్రమణదారులను వదిలి పెట్టాలనే ప్రయత్నం జోరుగా సాగుతోంది. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు మండలం, ఎగువమాసాపల్లి ప్రాంతంలో అటవీ భూమి కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు గురువారం అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు జేసీబీలను సీజ్ చేయగా.. ఇద్దరు డ్రైవర్లను అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఆక్రమిత భూమి పై అటవీ, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. ఇది అటవీశాఖ భూమి అని తేల్చారు. అయితే కూటమి బడా నేతలు ఆక్రమణదారులను ఈ కేసు నుంచి తప్పించడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని విషయాలు గోప్యంగా ఉంచుతుండడం పలు విమర్శలకు తావిస్తోంది. కాగా ఈ విషయంపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

డీఎస్సీకి 26,501 దరఖాస్తులు


చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ పరీక్షకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 26,501 మంది అభ్యర్థు లు దరఖాస్తులు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 16 వ తేదీతో దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ముగిసింది. జిల్లాలో 1,478 పోస్టులకు నోటిఫి కేషన్ జారీ చేశారు. అయితే దరఖాస్తులకు గడువు ముగిసేనాటికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 26,501 మంది దరఖాస్తులు చేసుకున్నారు. గత నెల 20వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

- **మహిళలే అత్యధికం:** జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల్లో మహిళలే అత్యధికంగా ఉండడం విశేషం. 26,501 మంది దరఖాస్తు చేసుకోగా అందులో మహిళలు 16,348 మంది, పురుషులు 10,153 మంది ఉన్నారు. అయితే కొందరు అభ్యర్థులు తమ అర్హతలను బట్టి పలు సబ్జెక్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ విధంగా జిల్లాలో 45,221 దరఖాస్తులు నమోదయ్యాయి.
- **ఒక్క పోస్టుకు 31 మంది వరకు పోటీ:** అందిన దరఖాస్తుల ప్రకారం ఒక్కో పోస్టుకు 31 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. ఈ డీఎస్సీకి అత్యధికంగా పోటీ ఉండడంతో అభ్యర్థులు పుస్తకాలకు అతుక్కుపోయారు. కొందరు కోచింగ్ సెంటర్లలో, మరికొందరు ఇళ్లల్లో పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.
- **మెలికలతో పలువురికి నష్టం:** కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్‌లో ఊహించని విధంగా మెలికలు విధించింది. ఈ మెలికల వల్ల జిల్లాలో దాదాపు 6 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. రిజర్వుడు అభ్యర్థుల అర్హత మార్కులను 40 శాతానికి తగ్గించి, టెట్‌లో వీరికి ఇచ్చిన నిబంధనల మేరకు డీఎస్సీకి అర్హత మార్కులు తగ్గించినట్టు ప్రకటించింది. అయితే, ఇదే టెట్‌లో జనరల్ అభ్యర్థులకు 45 శాతం మార్కుల నిబంధన ఉన్నా పట్టించుకోకుండా, సుప్రీంకోర్టు తీర్పు, ఎన్‌సీటీఈ గెజిట్‌కు విరుద్ధంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేసింది. దీంతో దాదాపు 3 లక్షల మంది డీఈడీ, బీఈడీ చేసిన జనరల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు.

కులాల వారీగా దరఖాస్తులు ఇలా..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో కులాల వారీగా పరిశీలిస్తే ఎస్సీ గ్రేడ్–3 అభ్యర్థులు అత్యధికంగా 7,997 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఓసీలో 2,856, బీసీ-ఏలో 4 వేలు, బీసీ-బీలో 3,790, బీసీ-సీలో 101, బీసీ-డీలో 2,570, బీసీ-ఈలో 1,661, ఎస్సీ గ్రేడ్–1లో 4, ఎస్సీ గ్రేడ్–2లో 1,872, ఎస్సీ గ్రేడ్–3లో 7,997, ఎస్టీలో 1,650, ఈడబ్ల్యూఎస్‌లో 1,664, పీహెచ్ పరిధిలో వీహెచ్ 134, హెచ్‌హెచ్ 57, ఓహెచ్ 595, ఎంఐ 11 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న బాలికలు

– జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడాకారులు నువ్వా...నేనా అన్నట్టు తలబడ్డారు. ఈ పోటీలకు రాష్ట్ర స్థాయిలోని వివిధ జిల్లాల నుంచి అండర్–17, అండర్–23 విభాగాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి రోజు ప్రారంభమైన ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన అండర్ 17 బాల, బాలికల కుస్తీ క్రీడాకారులు తలబడ్డారు. ఈ నెల 17న నిర్వహించే పోటీల్లో అండర్ 23 బాల, బాలికల జట్ల క్రీడాకారులు పాల్గొననున్నారు. కుస్తీ పోటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కే పురుషోత్తం, రాష్ట్ర సెక్రటరీ భూషణం, కోచ్ రఫీ పాల్గొన్నారు.

పలమనేరులో భారీ వర్షం



నిండు కుండలా మారిన బొమ్మిదొడ్డి చెరువు

పలమనేరు: పలమనేరులో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. కొలమాసనపల్లి పంచాయతీ, దిగువమారుమూరు గ్రామానికి చెందిన రామచంద్ర ఇంటి పక్కనే ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. ఇంట్లో నిద్రిస్తున్న వారు హడలిపోయారు. భారీ వర్షం కారణంగా పలు పంటలకు నష్టం వాటిల్లింది. మామిడి కాయలు నేలరాలాయి. తీగ పంటలు సైతం నేలవాలిపోయాయి. పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మొరవెత్తిన బొమ్మిదొడ్డి చెరువు

మండలంలోని బొమ్మిదొడ్డి చెరువు వర్షాలతో మొరవెత్తింది. మిగిలిన చెరువులకు కొంత మేర వర్షపునీరు చేరింది. కౌండిన్య నదిలోని చెక్‌డ్యామ్‌లకు సైతం వరదనీరు చేరింది. ఇదేవిధంగా మరో రెండ్రోజులు వర్షాలు పడితే మరిన్ని చెరువులకు నీరు చేరే అవకాశం ఉంది.





కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు, ఇంటిపై పడిన పిడుగు గుర్తులు